క్లుప్తంగా

రాష్ట్ర సర్పంచ్‌ల సమావేశంలో స్టాలిన్



మంత్రి ముత్యాల నాయుడుతో జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్

కడియం: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సర్పంచ్‌ల సమావేశంలో కడియం మండలం జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ గురువారం పాల్గొన్నారు. నియోజక వర్గానికి ఒక సర్పంచ్ చొప్పున ఈ సమావేశంలో పాల్గొనేందుకు అవకాశం కలిగింది. ఇందులో భాగంగా స్టాలిన్‌కు ఈ అవకాశం దక్కింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడిగ ముత్యాల నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ పంచాయతీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆనంద్ నగర్ పాఠశాల సందర్శన



ఆనంద్ నగర్ పాఠశాలలో మాట్లాడుతున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అకాడమీ క్యాలెండర్ ప్రకారం పాఠశాల విద్యా కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఆనంద్ నగర్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ యూనిఫాం, షూ ధరించి రావడంతో వారిని అభినందించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అకడమిక్ అంశాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. హెచ్ఎం బీపీ శాంత కుమారి, ఉపాధ్యాయులు, సీఆర్పీ ఇందిర పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరుని కల్యాణం



వేంకటేశ్వరుని కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏటా కల్యాణం జరిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూల మండపంలో స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు పర్యవేక్షణలో వేద పండితులు ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాత్రి స్వామికి గరుడ వాహనంపై గ్రామోత్సవం జరిపారు. కోలాట భజన బృందాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పులతో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. రథంపై స్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేశారు. వాహనాన్ని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. అలాగే గురువారం నిత్య పూజలతో పాటు అన్నకూటోత్సవం, హనుమంత వాహన సేవలు ఉంటాయని ఆలయ భక్త బృందం తెలిపింది.

ఉత్సాహంగా బాక్సింగ్ పోటీలు



బాక్సింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ప్రకాశం నగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఎస్‌కేవీటీ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో అండర్ 19 విమెన్ బాక్సింగ్ 44 – 80 కేజీల విభాగంలో 13 మంది బంగారు, 13 మంది వెండి, ఏడుగురు కాంస్య పతకాలు సాధించారు. 46 కేజీల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీహెచ్ సాయి వరలక్ష్మి బెస్ట్ బాక్సర్‌గా ఎంపికయ్యారు. డీఈవో ఎస్.అబ్రహం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పీడీ ఏవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.



రథోత్సవంలో కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



రథోత్సవంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ధవళగిరి.. భక్తఝరి

- వైభవంగా జనార్దనస్వామి కల్యాణం, రథోత్సవం
- తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీజనార్దనస్వామి



స్వామిని దర్శించుకుంటున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ధవళేశ్వరం: ధవళగిరి జనార్దనస్వామి రథోత్సవం, కల్యాణోత్సవం బుధవారం కన్నులపండువగా జరిగాయి. భక్తుల గోవింద నామస్మరణతో ధవళగిరి పులకించింది. తెల్లవారుజామున స్వామి వారికి విశేష అర్చనలతో కల్యాణ మహోత్సవాలు మొదలయ్యాయి. ఉదయం రథం సంప్రోక్షణ, మధ్యాహ్నం 3.15 గంటలకు రథోత్సవం, అనంతరం ధ్వజారోహణ, అంకురార్పణ, వాస్తుపూజ, రాత్రి స్వామివారి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందన నాగేశ్వర్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

రామపాదాల క్షేత్రంలో పుణ్యస్నానాలు

తెల్లవారుజాము నుంచే వేల మంది భక్తులు స్థానిక రామపాదాల క్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరించి జనార్దన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ఎస్ పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి బి.సూరిబాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారి కొండ దిగువ నుంచి ప్రారంభమైన రథోత్సవం అంకాలమ్మ గుడి మీదుగా ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్ వరకు సాగింది. భక్తులు, యువకులు అధిక సంఖ్యలో స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు సుదర్శనం వెంకట సత్యనారాయణ ఆచార్యులు (కాసులు), పవన్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనా మహోత్సవం



అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధి వెంకటగిరి–2లోని హరిహర క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ఠాపనా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అభయాంజనేయస్వామి విగ్రహాన్ని హుకుంపేట పీఏసీఎస్ చైర్ పర్సన్, పిడింగొయ్యి మాజీ ఉప సర్పంచ్ బొప్పన సుబ్బారావు, ఆయన కుమారుడు బొప్పన శేఖర్ వితరణ చేశారు. స్థానికంగా సమోసాల వ్యాపారం నిర్వహిస్తున్న సిరిశెట్టి మల్లికార్జున్, దుర్గా దంపతులు సాయి విగ్రహాన్ని బహూకరించారు. ఈ విగ్రహాలకు బుధవారం ఉదయం 9.21 గంటలకు వేద పండితులు సత్యనారాయణ, శాస్త్రి పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పర్వతనేని రాజేంద్ర ప్రసాద్ దంపతులు పీటలపై కూర్చుని నూతన విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కాపా శ్రీను, స్థానిక పెద్దలు ర్యాలీ వెంకటేశ్వరరావు, మొండి నాగేశ్వరరావు, నున్న శ్రీను, బీదం రాజు, మాకిరెడ్డి నారాయణ పాల్గొన్నారు. ఇప్పటికే హరిహర క్షేత్రంలో జ్ఞాన ప్రసూనాంబ, కల్యాణ వెంకటేశ్వరస్వామి కొలువుదీరారు.

క్రీడాపోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ అఖిల

రాజమహేంద్రవరం రూరల్: విశాఖ జిల్లా సింహాచలంలో గత నెల 29, 30, 31వ తేదీల్లో జరిగిన మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో బొమ్మూరు బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. టెన్నికాయిట్‌లో విజేతగా నిలిచి ట్రోఫీని అందుకున్నారు. ఈ విద్యార్థినులు చేసిన యోగా విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ మేరకు బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ విద్యార్థినులు, పీఈటీ కె.రమ్యను ప్రిన్సిపాల్ జి.అఖిల అభినందించారు.

వసంత్ కుమార్ సేవలు చిరస్మరణీయం



మాజీ మంత్రి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉండవల్లి అరుణ్ కుమార్ తదితరులు

ప్రకాశం నగర్: మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్ అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రకాశం నగర్ ధర్మంచర హాల్లో ఎస్ఎస్ రాజా, ప్రసాదుల హరినాథ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం వట్టి వసంత కుమార్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు సూర్యప్రకాశరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మాజీ ఎంపీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ వసంత్ కుమార్ అగ్రికల్చర్ బీఎస్సీ, ఎంబీఏ, పీహెచ్‌డీ చేసి, ప్రొఫెసర్‌గా పనిచేసి, రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అవినీతి మచ్చ లేకుండా హుందాగా వ్యవహరించారన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వసంత్ కుమార్ సేవలు చిరస్మరణీయమన్నారు. సీనియర్ పాత్రికేయుడు వీఎస్ఎస్ కృష్ణకుమార్, చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, కాంట్రాక్టర్ మంతెన కేశవరాజు, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు, కాంగ్రెస్ నాయకులు రామినీడు మురళీ, బాలేపల్లి మురళీధర్, బెజవాడ రంగారావు, జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబీ, నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు.

నీతి అయోగ్ వైద్యబృందం సమీక్ష



నీతి అయోగ్ బృందానికి స్వాగతం పలుకుతున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ బృందం బుధవారం బొమ్మూరులోని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో సమీక్షించింది. ఎనిమీయా, ముక్తి భారత్ రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే), రాష్ట్రీయ కిశోర్ స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌కేఎస్‌కే), పీఎంఈవై, నులిపురుగు దినోత్సవం తదితర కార్యక్రమాల అమలుపై మనీష్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు సమావేశం నిర్వహించారు. సమగ్ర విశ్లేషణ, భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళికపై జిల్లా వైద్య, అనుబంధ శాఖల అధికారులతో మాట్లాడారు. జిల్లాలో రక్తహీనత నివారణకు జరిగే కార్యక్రమాలపై ఆరా తీశారు. స్త్రీ,శిశు సంక్షేమ అభివృద్ధి, విద్య, ఆరోగ్య శాఖల సమన్వయంతో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో రక్తహీనత నివారణ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారి కె.విజయ కుమారి , జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, డీఎల్‌టీవో డాక్టర్ అండ్ వసుంధర, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి.వరలక్ష్మి, డాక్టర్లు చైతన్య, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదాతలతో షర్మిల అశోక్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమని జిల్లా ప్రజా రవాణాధికారి కె.షర్మిల అశోక్ అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపోలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి, రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, రావులపాలెం డిపోలకు చెందిన 78 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం, సీనియర్ మెడికల్ ఆఫీసర్ ప్రసూనాంబ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాతోనే యువతకు భవిత



సమర యాత్రలో మాట్లాడుతున్న నాయకులు

కంబాలచెరువు: రాష్ట్రంలో యువత భవిష్యత్తు ప్రత్యేక హోదాపై ఆధారపడి ఉందని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రాన్ని చిన్నచూపు చూస్తున్న బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు యువత సమరశంఖం పూరించాలని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన సంఘాలు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సమర యాత్ర బుధవారం రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ సందర్భంగా బుధవారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, ఏఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మన రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. పాచిపోయిన లడ్డూలు ఇచ్చారని అంటూ గతంలో మండిపడిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బీజేపీ విష కౌగిలిని వీడాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం యువజన విద్యార్థి సంఘాలు చేస్తున్న సమర యాత్రకు సీపీఎం రాష్ట్ర కమిటీ తరఫున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని, రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.అశోక్, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, కోనసీమ జిల్లా కార్యదర్శి సత్తిబాబు పాల్గొన్నారు.

నగరంలో 78 శాతం పింఛన్ల పంపిణీ



రాజరాజేశ్వరికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ స్వర్ణ

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో తొలి రోజు బుధవారం 78 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు తమ పరిధిలోని లబ్ధిదారులకు సొమ్ములు అందజేశారు. కొత్తగా మంజూరైన వారితో కలసి 29,363 మందికి పింఛన్ అందజేయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.8,21,53,250 ఖర్చు చేస్తోంది. 79వ సచివాలయం సుభాష్ నగర్‌కి చెందిన బాసరాజు రాజరాజేశ్వరి బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో సచివాలయం వలంటీర్ స్వర్ణ బుధవారం ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది.

విభిన్న నైపుణ్యాలు ఎంతో అవసరం

రాజానగరం: సివిల్ ఇంజినీర్లకు విభిన్న నైపుణ్యాలు ఎంతో అవసరమని ఉమ్మడి ఏపీలోని విశ్రాంత చీఫ్ ఇంజినీర్, ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల జలవనరులు, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖ సలహాదారు ఆచార్య పెనుమత్స రామరాజు అన్నారు. మట్టిలో కంటే రాతిలో లభించే భూగర్భ జలాలు ఎంతో బాగుంటాయన్నారు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లీలావతి, జీఎం డాక్టర్ పి.సుబ్బరాజు, డైరెక్టర్లు డాక్టర్ పీఆర్‌కే రాజు, డాక్టర్ ఆర్ఎస్ రాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ వరహా లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో మదుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యంలో జరుగుతున్న చందన యాత్ర మహోత్సవాలు చివరి దశకు చేరాయి. బుధవారం ఉదయం చందన రూపంతో నిత్యరూప దర్శనం కల్పించారు. ప్రధాన అర్చకుడు అవసరాల శ్రీకిరణ్ స్వామి ఆధ్వర్యాన శ్రీవారి చక్రస్నానం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఇసుక రవాణా.. బతుకు భరోసా

- ఇసుక తరలింపుతో ఉపాధి
- సుమారు వెయ్యిమందికి ఆధారం
- సీఎం జగన్ నిర్ణయంపై హర్షం



ఎడ్లబళ్లపై ఇసుకను తరలిస్తున్న దృశ్యం

సీతానగరం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ముఖ్యంగా పేదల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారు. ఇలా దేశానికి మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచేలా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగానే గోదావరి పరివాహక ప్రాంతంలో ఎడ్లబండ్లపై ఆధారపడేవారికి జీవనోపాధికి చర్యలు చేపట్టారు. వారు ఎడ్లబళ్లపై ఇసుకను తరలించుకునేందుకు అనుమతి ఇచ్చారు.

జీవనోపాధి

సీఎం జగన్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల మండలంలో సుమారు వెయ్యిమంది ఎడ్లబళ్ల యజమానులకు జీవనోపాధి లభిస్తోంది. వీరు రోజూ ఒకొక్క బండి ద్వారా మూడు ట్రిప్పులు ఇసుక తోలకం జరిపి రూ.వెయ్యి సంపాదిస్తున్నారు. ఇందులో కొంత ఎడ్లదాణాకు పోగా రోజుకు రూ.700 మిగులుతోంది. అదే దూర ప్రాంత గ్రామాలకు అయితే రూ.500 నుంచి రూ.వెయ్యి వరకూ ఒక ట్రిప్పుకు ధర పలుకుతోంది. ఎడ్లబళ్లపై ఇసుక రవాణాకు వెసులుబాటు ఇవ్వడంతో వాటి యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తోలకం ద్వారా తమకు ఆదాయం వస్తోందని, దానితో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నామన్నారు.

ఎడ్లబండే ఆధారం

కాలం మారినా, యాంత్రీకరణ పెరిగినా నేటికీ పల్లెల్లో ఎడ్లబళ్లు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సీతానగరం మండలంలో ఇసుక తరలించడానికి ఇవే ఆధారం. మొక్కజొన్న, వరి, ఇతర ఉత్పత్తులను పొలాల్లో తూకం వేసిన అనంతరం ఎడ్లబళ్లపైనే లారీల వరకూ తరలిస్తుంటారు. దీనికి ప్రధాన కారణం పొలంలో తడి ఆరకపోవడమే. ట్రాక్టర్‌పై తరలించాలంటే అది పొలంలో దిగబడి పోతుందనే కారణంతో ఎడ్లబళ్లను వాడతారు. గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలకు ఎడ్లబళ్ల మీదుగానే ఇసుక తీసుకువస్తున్నారు. మండలంలోని రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, మునికూడలి, బొబ్బిల్లంక తదితర గ్రామాల ఇసుక ర్యాంపు నుంచి ఎడ్లబళ్ల ద్వారా ఇసుక సరఫరా అవుతుంది. ఏటిగట్టును ఆనుకుని ఉన్న గ్రామాలలో బండి ఇసుక రూ.350 గా కొనుగోలు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్లపైనే ఇసుకను తరలించేవారు.

ఇసుకతో ఉపాధి



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎడ్లబళ్లపై ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చారు. దీంతోవాటి యజమానులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రోజూ ఇసుకను వివిధ గ్రామాలకు తరలించి ఉపాధి పొందుతున్నారు.

– కొంచ భాస్కరరావు, మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు, వంగలపూడి

ప్రతిరోజూ రవాణా



టీడీపీ హయాంలో ఎడ్లబళ్లపై ఇసుక రవాణా జరిగేది కాదు. ఆ సమయంలో వ్యవసాయ పనులకు మాత్రమే అంతంత మాత్రంగా ఎడ్లబళ్లను వాడేవారు. ఇప్పుడు ప్రతిరోజూ ఇసుక రవాణా చేస్తున్నాం. అలా వచ్చిన ఆదాయంలో జీవనం సాగిస్తున్నాం.

– మాదాసు రాంబాబు, సీతానగరం వెలమపేట

జక్కంపూడి ఫౌండేషన్ సాయం



నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలకు జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సీతానగరం, రఘుదేవపురం, రాపాక, చినకొండేపూడి, పురుషోత్తపట్నం, వంగలపూడి గ్రామాల్లోని 25 కుటుంబాలకు జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ వారి అక్షయ సంజీవిని కార్యక్రమంలో బియ్యం, రూ.రెండు వేలు విలువైన నిత్యావసరాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, వంగలపూడి సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, చిన కొండేపూడి సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ముదునూరి రామకృష్ణంరాజు, సీతానగరం ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, గెద్దాడ త్రిమూర్తులు, ఫౌండేషన్ కోఆర్డినేటర్ జాషువా పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

గోకవరం: పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ సూచించారు. మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి ఫలితాల్లో సాధించాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, ఎంఈఓ బి.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

రంగంపేట: వడిశలేరులో కొలువైన శ్రీదేవి–భూదేవి సమేత భజేనారాయణస్వామి వారి దేవస్థానంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాలు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.